## 4. ఎవరిని, ఎప్పుడు, ఎట్లా....

అప్పులు చేయడానికి ఉపక్రమించే ముందు చేయవలసిన కృషినంతా వివరించానుకదా. ఇక ఎవ్వరిని అప్పు అడగాలె? ఎప్పుడు, ఎట్లా? అడుగవలె అనే విషయాన్ని గురించి ఈ ప్రకరణంలో చెపుతాను.

పైన జెప్పిన విధంగా సంఘంలో పేరు ప్రతిష్ఠలు సంపాదించిన వ్యక్తికి మొదట్లో కొంచెం పెద్ద మొత్తాలే అప్పు పట్టడము అంత అసాధ్యము కాదు.
ఒక్క సంగతి గమనించవలసి ఉన్నది. డబ్బు అవసరమైనపుడే అప్పుకని బయలుదేరడము, చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకొన్నట్లు అవుతుంది. కనుక కొంచెం ముందుగానే జాగ్రతపడాలి, అప్పుఇచ్చే స్వభావం గల వాళ్ళు ఎవరో, దమ్మిడి చెయ్యి జారనివ్వనివ లైవరో ముందుగానే కనుక్కొని ఉంచుకోవాలె.

అదీగాక ఎవరిని ఏ సమయాన అడగవలసిందీ కూడా ముందు నిర్ణయించుకోవాలి. జూలై నెలలో ఈయా పెద్దమనుష్యులను అడుగుదాము, ఆగస్టులో వీరిని అడుగుదాము అని ఒక లిస్టు వ్రాసి ఉంచుకొనడము మంచిది.

అవసరము వచ్చినపుడే అప్పుకై బయలుదేరుతారు కొందరు. అది బొత్తిగా తెలివితక్కువ పని. మనకు అవసరమైనపుడు అవతలపెద్దమనిషి ఇస్తాడన్న

నమ్మకం ఏముంది! అవసరమున్నా లేకపోయినా అప్పు తెచ్చి ఉంచుకోవడము తెలివైనపని... అవసరం రాగానే అప్పుగా తెచ్చి ఉంచిన ఆ మొత్తం అక్కరకు వస్తుంది.

ఒకచోట ఒక వందరూపాయలు అప్పు పుట్టగానే ఇంకేం ఇక ఫర్వాలేదు, ఏ అవసరము వచ్చినా గడుపు కొంటానికి ఇది ఉన్నది కదా అని ఊరుకోకూడదు. ఆ అప్పు తెచ్చిన మొత్తం కదిలించకుండా పొట్లాం గట్టి పెట్టి అడుగున భద్రంగా పెట్టేసి వెంటనే మళ్లీ బయలు దేరాలి ఇంకో అప్పుకు. మళ్లీ అప్పుచేయడము ఎందుకు ఇప్పుడు అవిగాని అనుకొన్నవాడు వట్టి అల్పుడే కాక సంకుచిత దృష్టి కలవాడు. అనికూడా చెప్పవలసి వస్తుంది. ఎందుకంటే ఇవ్వాళ మన జన్మ లగ్నా నికి ఏ శుభగ్రహ వీక్షణమో తగిలి అప్పు పుట్టింది. రేపు పుడుతుందని నమ్మకం ఏమిటి! అప్పు పుట్టే గడి యలలోనే చేయగలిగినంత అప్పు చేయాలె. దాని తరు వాత మనము తన్నుకున్నా దమ్మిడీ పుట్టకపోవచ్చు. కాబట్టి "మేక్ హే వైల్ ది సన్ షైన్సు" అన్నట్లు దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలె.

ఇల్లాగ పెద్ద మొత్తాలు ఒకేసారి అప్పుగా తెచ్చి ఉంచడము వలన లాభం ఏమిటీ అంటే ఇందులో ఎవ రైనా ఒకరు అప్పుగా తీసుకొన్న మొత్తం తిరిగి ఇయ్యా మని అడిగితే చటుక్కున ఆ మొత్తం విసిరి పారేసినట్లు

ఇచ్చివేయవచ్చు. ఇల్లాగ అడగడంతోనే ఇచ్చివేయ వేయడము మళ్లీ అతనిదగ్గరనుంచే పెద్ద మొత్తాన్ని గుంజటానికే నన్నమాట మాత్రము మరచిపోవద్దు!

అప్పు తేవడము రెండో కంటివాడికి తెలియ కూడదు. కాని అప్పు ఇచ్చివేయడము మాత్రం నలుగు రికీ తెలిసే పద్ధతిలో ఇచ్చివేయవలె.

ఆ నలుగురూ ఎవరూ అంటే మనకు ముందు అప్పు ఇయ్యబోయే వాళ్ళు అన్నమాట! నీవు ఏదో ఇబ్బంది వచ్చి ఓ వంద తీసుకొని మళ్లీ అడిగించుకో కుండా ఇచ్చివేస్తున్నట్లు వాళ్ళకు తెలియాలి ఈ పని సాధించడములో చాలా తెలివితేటలు ఉపయోగించ డము కూడా చాలా అవసరము.

మనము జూలై నెలలో "వి. ఎల్. నరసింహాం" గారిని రెండు వందలు అప్పుగా ఇమ్మని అడగాలని ప్లాను వేసుకొని కూర్చున్నాము. అప్పుడు ఏమి చేయాలీ అంటే వారింటికి వెళ్ళి కులాసాగా కబుర్లు చెబుతూ కూర్చుని చటుక్కున ఏదో జ్ఞాపకం వచ్చినట్లు నటించి "చూడండి మీ నౌకర్లలో ఎవ్వరు నమ్మకమైనవాడో వాణ్ణి ఒకసారి పిలవండి, కొంచెం పనుంది" అనాలె. ఎవడో ఒకడు వస్తాడు. ఆ తరువాత నీవు జేబులోనుంచి నోట్లకట్ట తీసి అందులోనుంచి నూరు రూపాయలనోటు ఎత్తి నరసింహాంగారికే ఇచ్చి, "పురుషోత్తంగారికి ఈ వందరూపాయలూ అందాలండీ. మొన్న ఏదో అవస

రం వచ్చి చేబదులుగా తీసికొన్నాను. ఇవ్వాళ ఇస్తా నన్నాను. మీతో మాట్లాడుతూ ఆ విషయం మరచి పోయినాను. చూశారూ ఇస్తానన్న రోజుకు ఇచ్చి వేస్తేనే మాట దక్కుతుంది. ఏమంటారు?" అను. ఆయన "నిజమే ఆ మాట" అంటాడు. నిజమేనని ఆయన ఎప్పు డైతే అన్నాడో అప్పుడే నీయందు ఆయనకు సద్భావం కలిగిందన్నమాట !

పైన వివరించిన కార్యక్రమంలో ప్రతి చిన్న విషయానికీ ప్రాముఖ్యము ఉన్నది. ఆ నౌకరుకు డబ్బు ఆయన చేతే ఇప్పిస్తే, ఆ డబ్బుకు ఆయనే బాధ్యుడు అవుతున్నాడు. ఆయన చేతిమీదుగా ఇచ్చాడు కాబట్టి. నోట్లకట్ట ఎత్తి అందులోనుంచి నూరు రూపాయలనోటు తీయడము చూచినవాళ్ళు నీ దగ్గర చాలా డబ్బు ఉంటూ ఉంటుందనే విషయం గ్రహిస్తారు. ఇస్తానన్న రోజుకు ఇచ్చి వేయడము మంచిది అనడములో నీ సిజా యితీ తనము, మాట నిలుపుకొనే పట్టుదల, సత్యసంధత ఇవన్నీ బైటపడతవి.

ఇంకో విషయము ఏమిటీ అంటే ఆ పెద్దమనిషికి డబ్బు ముట్టినట్టు రసీదు తీసికొని రా అని నీవు చస్తే అనకూడదు. ఎందుకూ అంటే అది నీ దర్జాకు తగదు. ఆ పెద్దమనిషి ఒకవేళ డబ్బు ముట్టలేదూ అంటే విచార పడవలసింది ఆ నరసింహంగారు గాని నీవు కాదుగా !

రసీదు అడక్క పోవడములో ఇంకొక సుగుణము ఏమిటీ అంటే నీవు ఇల్లాగ వందా రెండువందలూ చులాగ్గా చేబదుళ్లు తెస్తూ మళ్ళీ ఇచ్చేస్తుంటావూ అని అవతల వాళ్లు విధిగా అనుకొంటారు.

ఇలాగ వ్యవహారం నడుపుకోవాలె. మొదటిరోజులలో అక్కడ తెచ్చి ఇక్కడా, ఇక్కడ తెచ్చి అక్కడా ఇస్తూ పలుకు బడిని వృద్ధి చేసుకోవాలె. ఎగగొట్టే సంగతి ఇప్పుడుకాదు. తగినంత ఆస్తి కూడిన తరువాత ఆ విషయమై ఆలోచించ వచ్చు. ఈ విషయంలో తొందర ఏమాత్రమూ కూడదు.

ఈ విధంగా సాగినంత కాలము ఎవ్వరికీ తెలియకుండా వాడిదగ్గరా వీడిదగ్గరా అప్పులు చేసి, కొన్ని తీరుస్తూ, తీర్చినదానికి మళ్లీ రెండింతలుగా అప్పుచేస్తూ కన్నుమూస్తూ, తెరుస్తూ గడిచినంత కాలము గడిపి, మనకు బోదన్‌లో పొలాలు లేవనీ, కోయంబత్తూరులో పేచు లేదనీ, తెలిసిన తరువాత చేతులు రెండూ పైకెత్త వచ్చు. అది ఇప్పటి సంగతికాదు! దానికో విధానం ఉన్నది. అదీ చెపుతాను దాని విషయం వచ్చినపుడు.

అయితే ప్రతి ఋణం తీర్చాలని పెట్టుకోకూడదు. తీర్చకుండా కాలం గడపడమే మన ప్రిన్సిపుల్. తీర్చడమనేది మళ్ళీఅప్పు దొరికించుకొంటానికే అన్న విషయం ఏ క్షణానా మరిచిపోకూడదు. అప్పు ఎప్పుడు అడగ

వలెనో ఇంతవరకు చెప్పినాను. ముఖ్యంగా నేనుచెప్పిన రహస్యం ఏమిటీ అంటే, అవసరము వచ్చినప్పుడు అప్పుకు బయలుదేరకూ అని! ఇల్లు అంటుకున్న తరువాత బావి త్రవ్వడము ఎవ్వరైన ప్రారంభిస్తారటయ్యా! ముందుగా త్రవ్వించి ఉంచుకోవాలె అట్లాగే అప్పులు తెచ్చి ఉంచుకోవాలె. ఇటువంటి దాన్ని "ముందు ఆలోచన" అంటారు. ఏ విషయంలోనైనా సరే ముందు ఆలోచన ఉండడము మనిషి అయిన వాడికి ఉండవలసిన సుగుణాలలో ఒకటీ అని మా సుబ్రహ్మణ్య శాస్త్రిగారు ఎప్పుడూ అంటూఉంటారు. అదిపరమ సత్యం!

ఈ ప్రసంగం ఇంతటితో ఆపేసి అప్పు అడిగే పద్ధతులనుగురించి తరువాత ప్రకరణంలో ముచ్చటిస్తాను.

## 5. అప్పు అడిగే పద్ధతులు

ఎవరినైతే అప్పు అడుగ దలచుకున్నావో అతనితో పరిచయం కావడమూ, అతడు నిన్ను గురించి సద్భావంకలిగి ఉండేలాగున చేయడమూ ఇవన్ని అయిపోయిన తరువాతనే దండయాత్రకు బయలు దేరాలె.

అప్పు అడగటము అనే కార్యాన్ని దండయాత్ర అంటున్నాను. ఈ అప్పును గుంజడములో శాస్త్రీయ పద్ధతులను వివరిస్తాను.